క్లుప్తంగా

జలవనరులశాఖ ఈఈగా సురేష్‌బాబు


సురేష్‌బాబు

కల్లూరు: జలవనరులశాఖ కల్లూరు డివిజన్ ఈఈగా జి.సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన లక్ష్మీనారాయణ నాలుగు నెలల క్రితం పదవీ విరమణ చేయడంతో ఖాళీగా ఉంది. గద్వేల్‌లో డీఈఈగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు పదోన్నతిపై కల్లూరు డివిజన్ ఈఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరు జలవనరులశాఖలో అధికారులు, సిబ్బంది సురేష్‌బాబుకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా అశోక్


మోర్ల అశోక్

బోనకల్: రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా బోనకల్ గ్రామానికి చెందిన మోర్ల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వాసిరెడ్డి


వెంకటేశ్వర్లు

ఏన్కూరు: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వాసిరెడ్డి వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో లచ్చగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లను అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా అజ్మీర నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా చీటీ కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్‌కె ఖాసీం, గౌరవ సలహాదారుడిగా బాధావత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా పూర్ణకంటి నాగరాజు, ఇంజం పుల్లయ్యతో పాటు మరికొందరిని ఎన్నిక చేశారు.

'ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం'

కొణిజర్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి విమర్శించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలో ఇటీవల డెంగీ లక్షణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను సోమవారం ఆమె పరామర్శించారు. అనంతరం కొణిజర్ల, పెద్దగోపతి పీహెచ్‌సీలను సందర్శించి వైద్యాధికారులతో మట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించడమే కాక గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

వైరా: వైరా మున్సిపాలిటీలో కమర్షియల్ టాక్స్ వసూలు చేసి మున్సిపాలిటీలో చెల్లించకుండా అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. వైరా వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ యు.గురులింగంకు వినతిపత్రం ఇచ్చారు. గతంలో వైరా సోమవరం పంచాయతీ కింద ఉన్నప్పుడు కూడా రూ.2 కోట్లు గోల్‌మాల్ జరిగినా ఇంతవరకు చర్యలు లేవని తెలిపారు. కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు పూర్ణకంటి రామారావు, ఓర్సు శ్రీనివాసరావు, పూర్ణకంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

కల్లూరురూరల్: మండలంలోని లింగాల గ్రామంలో పశువుల షెడ్ల నిర్మాణానికి గాను ఉపాధిహామీ పథకం ద్వారా 1.30 లక్షల రూపాయలు మంజూరు కాగా, చెక్కులను అయ్యాయి. ఒక్కొక్క షెడ్డుకు రూ.65వేలు చొప్పున రెండు షెడ్లకు నిధులు మంజూరు చేశారు. కాగా ఆ చెక్కులను సోమవారం లబ్ధిదారులు తేలూరి రాధా, ముసుగంటి అనూషలకు నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, నాయకులు వెంకటేశ్వరరావు, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతంతో రిజర్వేషన్ ఇచ్చినందుకు సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు ఆధ్వర్యాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తు సంబరాలు నిర్వహించి.. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఐలయ్య, తిరుపతిరావు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో కుక్కలు..



- గ్రామాల్లో స్వైర విహారం
- రోజుకో చోట దాడులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- హడలెత్తుతున్న గ్రామాల ప్రజలు


ముదిగొండలోని ఓ వీధిలో కుక్కలు

ముదిగొండ: శునకాల దాడులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. కనిపించిన వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఒక మనిషి తన ఇంటినుంచి బయటికి వెళ్తుంటే.. ఇంట్లో వారంతా రోడ్లపై కుక్కలున్నాయ్ జాగ్రత్త అంటూ హెచ్చరించాల్సిన పరిస్థితి మండలంలో చోటుచేసుకుంది. గ్రామాల్లో వీధుల వెంట కుక్కలు ఉంటే చాలు ఆ వైపు వెళ్లాలంటే పిల్లలు, మహిళలు, వృద్ధులు వెనుకాడుతున్నారు. పిల్లలు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేంత వరకు తల్లి దండ్రులు భయపడుతున్నారు.

జంకుతున్న ప్రజలు..

దురదృష్టవ శాత్తు కుక్క కరిస్తే బ్రతుకుతామో లేదోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వైద్యం చేయించుకున్నా ప్రాణాలతో ఉంటమన్న నమ్మకం కూడా కోల్పోతున్నారు. ఇటీవల ఐదుగురు వ్యక్తులు కుక్కల దాడిలో గాయాల పాలయ్యారు. ఇంత జరుగుతున్నా ఆయా పంచాయతీల సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలొస్తున్నాయి. ముదిగొండ, వల్లభి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కేవలం ఒకనెలలోనే సుమారు 80మంది కుక్కలు, కోతుల దాడిలో గాయపడ్డారు.

టీకాలు వేయించాలని గ్రామస్తుల వినతులు..

కుక్క కరిచినా రేబీస్ వ్యాధి సోకకుండా ఉండేందుకు ముందుగా యాంటీ రేబీస్ టీకాలు కుక్కలకు వేయాల్సి ఉండగా ఏ గ్రామంలో కూడా టీకాలు వేసిన దాఖలాలు లేవు. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తులు సంబంధిత అధికారులకు తెలిపి.. వినతులు అందించారు. కోతులు, కుక్కల నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు. కుక్కలు ప్రధాన రహదారుల వెంట చికెన్ సెంటర్ల ముందు విపరీతంగా ఉంటున్నాయి. వాహనదారులను వెంబడించడంతో వారు కంగారు పడి బైక్ పై నుంచి పడి కాళ్లు, చేతులు విరగొట్టుకుంటున్నారు. ముదిగొండ, వల్లభి పీహెచ్‌సీలలో ప్రతీ నెల కుక్క కాటుకు గురైన వారు దాదాపు 90 నుంచి 100 పైగా కేసులు నమోదౌతున్నాయి.

కుక్కల బెడద ఎక్కువగా ఉంది..



ఏ వీధిలో చూసినా కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. వీటిని తక్షణమే నివారించాలి. పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని కోతులు, కుక్కల బెడద లేకుండా చూడాలి. కుక్కకాటుకు ప్రజలు చిన్నపిల్లలు బలికాకుండా చూడాలి. మా బాబును వారం క్రితం కుక్కలు ఎగబడి మరీ కరిచాయి. ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

– కర్నె శ్రీకాంత్, ముదిగొండ బీసీ కాలనీ

టీకాలు వేయించాలి..



కుక్కలు కరిచినా ర్యాబీస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలి. మొన్న నేను బైక్‌పై రోడ్డుమీద ప్రయాణిస్తుంటే ఒ కుక్క వెంటపడింది. నెమ్మదిగా వెళ్లేసరికి అక్కడే ఆగింది. ఇలా ఎంతోమంది కుక్కల దాడిలో గాయాలపాలైనారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి.

– గడ్డం వెంకట్, న్యూలక్ష్మీపురం

సూచనలు చేస్తున్నాం..



ప్రతి గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద ఉన్న చోట వాటిని పట్టి అడవుల్లో వదిలేందుకు చర్యలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో కుక్కల నివారణకు మార్గదర్శకాలు అడిగారని, ప్రతి పంచాయతీలో గ్రామ సభల్లో ఇకనుంచి తీర్మానాలు చేసి కోతులు, కుక్కలు లేకుండా చూడడానికి చర్యలు తీసుకుంటాం.

– వాల్మీకి కిషోర్, ఎంపీఓ, ముదిగొండ

రైతులకు నష్టపరిహారం అందించాలి


చింతకాని: పెసర పంటను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు

చింతకాని: అధిక వర్షాలతో పంట నష్టంపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అదే విధంగా నేరేడ గ్రామంలో పంటపొలాలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలకు పెసర పంటకు మొలకలు రాగా.. పత్తి పంటలో నీళ్లు నిలిచి మొక్కలు ఎర్రబారి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్నారు. పెసర పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. అధికారులు సర్వే చేపట్టి పెసరకు రూ.20వేలు, వరికి రూ.30వేలు, పత్తికి రూ.50వేలు నష్ట పరిహారం అందించాలన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపి, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, సీపీఎం, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో రాళ్లవాగు ఉధృతికి నీట మునిగి కొట్టుకుపోయిన పంటచేలను సోమవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సదర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మండల కార్యదర్శి భాస్కర్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావొద్దు..

మధిర: యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సంఘ సేవకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాళ్లూరు బాలరాజు అన్నారు. సోమవారం జిలుగుమాడులో షేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో.. డైరెక్టర్ జి.గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి యువత పట్టుకొమ్మలని, వారు మంచి ఆలోచనలను కలిగి ఉండాలన్నారు. అదే విధంగా జానపద కళాకారుడు కొండయ్య మాట్లాడుతూ.. మనిషి జీవితంలో మంచి పనులు చేసి మంచి పేరు రావాలి, కుటుంబాలు బాగుపడాలి అంటూ పాటల రూపంలో వివరించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తల్లాడ: మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో.. భారత దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అనే అశంపై నిర్వహించిన వాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ప్రదీప్‌రెడ్డి, కోఆర్డినేటర్ సిస్టర్ కిరణ్, ఉపాధ్యాయులు.. విద్యార్థులను అభినందించారు.

సమస్యలపై 'సీపీఎం' ధర్నా



ముదిగొండ: చిరుమర్రిలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ దుటు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్నపాత ఎన్టీఆర్ కాలువను పూడ్చి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, కుమారస్వామి, బుచ్చయ్య, యాలాద్రి, కృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ సమస్యలపై నిర్వహించిన ధర్నాలో సీపీఎం మధిర డివిజన్ సభ్యుడు ఆలస్యం రవి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటుగా, వీధిలైట్లు ఏర్పాటు, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, రైతులకు యూరియా అందించాలని కోరుతూ.. పంచాయతీ కార్యదర్శి చిరంజీవికి వినతిపత్రం అందించారు.

ముదిగొండ: కాంగ్రెస్‌పార్టీ నిరంకుశ పాలనను వ్యతిరేఖిస్తూ సీపీఎం నాయకులు చిరుమర్రిలోని జీపీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి కార్యదర్శికి వినతిపత్రం అందించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండి రమేష్ రాష్ట్ర ఐద్వా సభ్యురాలు బండి పద్మ, సీపీఎం గ్రామ సెక్రటరీ రామారావు, మాజీ ఎంపీటీసీ అరుణ, ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు తాళ్లపల్లి కృష్ణ, మేరుగు రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక జీపీఎదుట ఆందోళన నిర్వహించి పంచాయతీ కార్యదర్శి రవికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నారాయణ, రామారావు, తిలకం, విజయ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

సీపీఎస్ రద్దు కోరుతూ పింఛన్ విద్రోహ దినంగా పాటిస్తూ సోమవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. టీఎస్ యూటీఎఫ్‌కార్యాలయాల నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం పెట్టి ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షన్ హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అంతకు ముందు పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్లకుండా పీఆర్‌టీయూ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర : మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్



పెనుబల్లి: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


కారేపల్లి: శాంతినగర్ ఆశ్రమ పాఠశాలలో..


బోనకల్‌లో..

వితరణలు వెల్లువ..

గ్రామ స్థాయిలోనూ లయన్స్ క్లబ్ సేవలు


సైకిల్, నగదు, గొడుగులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

కొణిజర్ల: లయన్స్‌క్లబ్ విస్తృతం చేయాలన్న లక్ష్యంతో నూతన క్లబ్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. కొణిజర్లలో వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వై.బుచ్చిరామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆతర్వాత జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ నేతృత్వాన కొణిజర్ల క్లబ్ వివరాలు ప్రకటించారు. అధ్యక్షుడిగా కొణతం శ్రీనివాసరావు, సెక్రటరీగా నరేష్, కోశాధికారిగా సంపత్‌ను ఎన్నుకోగా, ముగ్గురు వీధివ్యాపారులకు గొడుగులు, తుమ్మలపల్లికి చెందిన నిరుపేద విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సాయం, బాలికకు సైకిల్ అందజేశారు. మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుతో పాటు డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, డాక్టర్ స్వర్ణ వాసు, ఉపేందర్, నాగేశ్వరరావు, అచ్యుత్, పుల్లయ్యాచారి, ఉమాశంకర్, నాగయ్య, ప్రసాద్,అప్పారావు, రమణ, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

మధిర: మండల పరిధిలోని మాటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బొర్రా స్వరాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం బొర్రా శ్రీనివాసరావు చేతులమీదుగా రూ.11వేల నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి మాట్లాడుతూ.. పాఠశాలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.11వేలు నగదు అందించారు. గత మార్చిలో ఎస్సెస్సీలో పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచిన కావ్యకు.. మధిర కోఆపరేటివ్ బ్యాంక్ క్యాషియర్ దీవి యశశ్విని వేయి రూపాయల నగదు బహుమతి ఇచ్చారు. అనంతరం దీవి యశశ్విని ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు..

కారేపల్లి: మండలంలోని గాదెపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం తేజావత్ శారద సోమవారం అందించారు. గాదెపాడు యూపీఎస్ హెచ్‌ఎం రసకట్ల మల్లేశ్వరరావు, తన మిత్ర బృందం అందించిన ఆర్థిక సాయంతో విద్యార్థులకు బ్యాగులు, పాఠశాలకు మైక్, సౌండ్ బాక్స్‌లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగీలాల్, బిక్కు, కిషన్, మురళీ, కృష్ణవేణి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కృష్ణారావు, సీఆర్‌పీ పరమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల..

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతికి చెందిన నిరుపేద పాలెపు సైదులు అతని భార్య ఉమ అనారోగ్యంతో బాధపడుతుండగా.. విషయం తెలుసుకున్న సైదులు స్నేహితులు సోమవారం తమవంతు సాయంగా రూ.20వేలు, 50కేజీల బియ్యం అందించారు. అదే విధంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కోటా భిక్షానికి రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్ ఉద్దండు సాహెబ్, కోయిని రామారావు, సున్నా రామకృష్ణ, విశాలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం నీతోడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు నందిగామ మనోహర్ కుమార్తె స్వేచ్ఛామత జన్మదిన వేడులకు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పాల్ నర్సింహారావు, వృద్ధాశ్రమం ఇన్‌చార్జ్ తలారి కవిత, సముద్రాల మురళీకృష్ణ, నందిగామ యలమంద, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు గ్రైండర్..


గ్రైండర్‌ను అందిస్తున్న సత్యనారాయణరెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రూ.25వేల విలువైన గ్రైండర్‌ను దాత గూడూరు కోటిరెడ్డి వితరణ చేయగా.. సోమవారం ఎస్‌జెకెఎం కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారణరెడ్డి పాఠశాల సూపరింటెంట్ కె.సరితకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు పంపిణీ


విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులను అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేతన ఫౌండేషన్, పాఠశాల సిబ్బంది సంయుక్తంగా అందజేసిన టై, బెల్టు, ఐడీ కార్డులను ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుతూ విద్యాభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సలాది రామారావు, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల ఊరేగింపు


సత్తుపల్లిలో గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం


కొణిజర్ల: అమ్మపాలెం బీసీ గురుకులంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు వీధుల్లోని గణనాథులను కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తామర చెరువు, బేతుపల్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలు మండపాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీప్రసన్న గణపతి ఛారిటబుల్ ట్రస్ట్‌లోని వినాయకుడిని దర్శించుకున్న భక్తులకు తిరుమల, గణేష్ దంపతులు రాగి, జొన్నజావ పంపిణీ చేశారు. వీరిని ట్రస్ట్ కమిటీ నిర్వాహకులు కూసంపూడి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, మండపాటి కేశవరెడ్డి, దారా ఏకాదశిమూర్తిలు సత్కరించారు.

రూ.30,516 పలికిన లడ్డూ ధర..

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామంలో వేలం పెట్టిన గణపతి లడ్డూను ముస్లీం భక్తుడు షేక్ జానీపాషా రూ.30,516కు దక్కించుకున్నాడు. జానీ పాషాకు లడ్డూను కమిటీ వారు అందజేశారు.

కొణిజర్ల: మండల పరిధిలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వినాయకుడిని ఊరేగించి తనికెళ్ల చెరువులో నిమజ్జనం చేశారు.

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కల్లూరు, రామనగర్, రజకబజార్‌లలోని వినాయక మండపాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సత్యంబాబు, శ్రీనివాసరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి


కల్లూరు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కల్లూరురూరల్: అక్రమంగా నిర్మించిన చేపల చెరువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు తహసీల్దార్ పులి సాంబశివుడికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. కిష్టారం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తాళ్లూరి సమీపంలో రైతులకు తెలపకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా చేపల చెరువులు నిర్మించి పెద్దెత్తున కరకట్టలు ఏర్పాటు చేశారన్నారు. దీంతో నీరు సాఫీగా వెళ్లేందుకు అవకాశం లేక సమీ పంలోని సుమారు 150 ఎకరాల పొలాలు నిటమునిగాయన్నారు. ఈ విషయాన్ని చేపల చెరువుల యాజమాన్యలకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని, మత్స్యశాఖకు ఫిర్యాదు చేయగా.. చెరువులను పరిశీలించి నీరు నిల్వ లేకుండా కాల్వలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయినా చెరువుల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇకనైనా యాజమాన్యాలు కాలువలు ఏర్పాటు చేసి, జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ.. జిల్లా కలెక్టర్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌లకు విజ్ఞాపన పత్రాలు అందించారు. వినతి అందించిన వారిలో రైతులు ఖమ్మంపాటి రామారావు, వడ్లమూడి రామకృష్ణ, రెడ్డి కృష్ణారావు, ఖమ్మంపాటి కృష్ణమూర్తి, రెడ్డి వెంకటేశ్వరరావు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కొత్తకట్ట సిద్ధారెడ్డి కాల్వపై బ్రిడ్జిలు నిర్మించండి

సత్తుపల్లి: రామానగరం కొత్తకట్ట సిద్ధారెడ్డి కాల్వపై బ్రిడ్జిలు నిర్మించాలని తహసీల్దార్ సత్యనారాయణను కాంగ్రెస్, సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకుడు ఒంటెద్దు సాయి కోరారు. వర్షాల వల్ల వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో తహసీల్దార్ సోమవారం కొత్తకట్ట కాల్వను పరిశీలించారు.

శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో రామిశెట్టి పుల్లయ్య ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కొందరు వ్యక్తుల ధ్వంసం చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఆర్‌ఐ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే పార్టీ పరంగా కార్యచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో పెద్ద కోటేశ్వరరావు, నాగుల్‌మీరా, సురేష్ తదితర్లున్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీరు

తల్లాడ: మండలంలోని పినపాక పంచాయతీలోని వెంకటాపురంలో గత పది రోజుల క్రితం రక్షిత మంచి నీటి పథకం విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురవడంతో పాటు పైప్‌లైన్‌కూడా పగలడంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు బోర్లపై ఆధారపడి ఇబ్బందులు పడుతుండగా.. సోమవారం పోలేపల్లి కోటేశ్వరరావు పొలంలోని బావిలలోని తాగునీటిని జీపీ ట్యాంకర్ ద్వారా గ్రామానికి తెప్పించి సరఫరా చేశారు.

ప్రజావాణిలో దంపతుల ఆందోళన

బోనకల్: బోనకల్ రైతువేదికలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారుల ఎదుట భార్యాభర్తలు ఆందోళనకు దిగారు. మండలంలోని చొప్పకట్లపాలెంకు చెందిన మండేపుడి బ్రహ్మం – రాణి దంపతులు తమ భూ సమస్య పరిష్కరించాలంటూ అధికారుల ఎదుట బైఠాయించారు. చొప్పకట్లపాలెం నుంచి నాగులవంచ గ్రామానికి వరకు బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో తమ పొలంలో నీళ్లు నిలిచి పంట దెబ్బతిన్నదని వాపోయారు. సమస్యను తహసీల్దార్ రమాదేవి పీఆర్, ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పడంతో బ్రహ్మం దంపతులు ఆందోళన విరమించారు.

రోడ్డుపై గుంతల పరిశీలన

తల్లాడ: వర్షాలకు తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పడిన గుంటలను నేషనల్ హైవే అథారిటీ ఏఈ కిరణ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓ కృష్ణారావు సోమవారం పరిశీలించారు. నీరు నిల్వలేకుండా కల్వర్టు కట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, చింటూ, జమాల్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించారు.